


**కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి**

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
మంగళవారం | 09 జూన్ , 2026 | పేజీలు : 07

# పలకరించిన తొలకరి...!
# పులకరించిన పుడమి!!

**తొలకరి పలకరించింది దీంతో పుడమి తల్లి పులకరించిపోయింది. 2026 జనవరి నుండి ఇప్పటి వరకు వరణుడు ముఖం చాటేయ డంతో భానుడి భగభగలతో సెగలు పొగలు కక్కింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా వర్షాలు లేక తీవ్ర ఎండ వేడిమితో జనం కూడా ఉక్కిరిబిక్కిరి అయ్యారు.**




**ప్రజాపక్షం/సూర్యాపేట :** రోహిణి కార్తె ప్రారంభం ముందు నుండే సూర్యాపేట జిల్లాలో 40 నుండి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదైంది. వాతావరణ శాస్త్రజ్ఞులు ఈ ఏడాది రుతుపవనాలు ముందుగానే వస్తాయని చెప్పడంతో జనం ఎంతో సంతోషించారు. తర్వాత కొద్ది రోజులకు ఎల్నీనో ప్రభావంతో రుతుపవనాల రాక మరింత ఆలస్యమవుతాయని ఈ ఏడాది సాధారణ వర్షపాతం కన్నా తక్కువ నమోదు అవుతుందని చెప్పడంతో అందరూ ఆశలు వదులుకొని నిరాశకు లోనయ్యారు. జిల్లాలో సగటు వర్షపాతం 821.0 మి.మీటర్ల వరకు నమోదవుతుండగా నైరుతి రుతుపవనాలతో జూన్ నుండి సెప్టెంబర్ వరకు అధికంగా దాదాపు 180.0 మి.మీటర్ల వర్షపాతం నమోదవుతూ వస్తుంది. అక్టోబర్, సెప్టెంబర్ నెలల్లో ఈశాన్య రుతుపవనాలతో జిల్లాలో వర్షాలు కురుస్తాయి. వాతావరణ శాస్త్రజ్ఞులు తెలిపిన వివరాల ప్రకారం వాతావరణం పొడి పొడిగ ఉన్నా 515మి.మీటర్ల వర్షపాతం మార్చి, ఏప్రిల్ నెలల్లో ఈదురు గాలులతో కూడిన జల్లులు, మే వేసవి కాలంలో ఎండలు ఎక్కువగా ఉన్నా ఉష్ణోగ్రత 40 దాటినా తుఫాన్ ప్రభావంతో అప్పుడప్పుడు వర్షాలు పడడం సహజంగా వస్తుంది. కానీ ఈ ఏడాది జనవరి నుండి ఏలాంటి వర్షపాతం నమోదు కాకపోవడంతో పుడమి తల్లి ఎండవేడిమితో నిప్పులు కక్కింది. చెరువులు, కుంటలు, బోరుబావుల్లో ఉన్న నీటిమట్టం ఘననీయంగా పడిపోయింది. వర్షాభావ పరిస్థితులతో 2015, 2023/24 సంవత్సరాల్లో ఏర్పడిన కరువు మరోమారు వచ్చే అవకాశం ఉందనే వదంతులు కూడా వ్యాపించడంతో ప్రజలు ఇన్ని రోజులు ఆందోళనకు గురయ్యారు.

**రోహిణి కార్తె ముగిసిన మరుసటి రోజే...** రోహిణి కార్తె ముగిసిన మరుసటి రోజు మృగశిర కార్తె రోజున వరుణుడు కరుణించడం భానుడి భగభగలతో అల్లాడిన జనం వాతావరణం ఒక్కసారిగా చల్లబడ్డటంతో ఉపశమనం పొందారు. సూర్యాపేట జిల్లా కేంద్రంతోపాటు తుంగతుర్తి, కోదాడ, హుజూర్‌నగర్ నియోజక వర్గాల పరిధిలో ఆదివారం అర్ధరాత్రి, సోమవారం మధ్యాహ్నంతో పాటు రాత్రి వరకు ఆయా ప్రాంతాల్లో ఒక మోస్తరు భారీ వర్షాలు కురిశాయి. ప్రజలు ఆనందంతో తడిసిపోయారు.

**ఇది శుభసూచకంగా..** మృగశిర కార్తె ప్రారంభం మొదటి రోజే వరుణుడు కరుణించడంతో ఇది శుభసూచకమని రైతన్నలు చెబుతున్నారు. సాలేటి వర్షం కురిస్తే మెట్ట పంటసాగు పనులు ప్రారంభించే రైతులు ఈ తొలకరి పలకరించడంతో సాగుకు సన్నద్ధమవుతున్నారు. పంట సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సమకూర్చుకునే పనిలో పడ్డారు.



## కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి
### ప్రభుత్వ విప్ వేముల వీరేశం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. సోమవారం నకిరేకల్ పట్టణంలోని శ్రీనివాస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.పార్టీ విజయాల్లో బూత్ స్థాయి కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. గ్రామాలు, వార్డులు, బూత్‌ల స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని,ఇది నిజమైన ప్రజా ప్రభుత్వమని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి అర్హుడికి అందేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, వారి సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.పార్టీ శ్రేణులు ప్రజలతో నిరంతరం మమేకమై ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా వ్యవహరించాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ ట్రైనర్ ఎండీ నుమాన్ హాజరై బూత్ ఏజెంట్లకు శిక్షణ ఇచ్చారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత,మేనిఫెస్టో నెంబర్ చామల శ్రీనివాస్,మాజీ మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్,పిఎస్‌సి చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు, నాయకులు బోళ్ళ వెంకట్ రెడ్డి,వంటేపాక ఏసు పాదం,పెద్దిను క్కయ్య, కాంపాటి శ్రీనివాస్,పన్నాల రాఘవరెడ్డి లింగాల వెంకన్న, గాజుల సుకన్య ,యాస కరుణాకర్ పాల్గొన్నారు.

## నేడు భువనగిరికి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క
### రూ. 14.05 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
### ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి



**ప్రజాపక్షం/భువనగిరి :** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మంగళవారం భువనగిరిలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ తంగేళ్లపల్లి శ్రీవాణిల ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లా అధికార యంత్రాంగం కూడా ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేసింది.

**పర్యటనలోని ముఖ్య కార్యక్రమాలు:** టీజీ ఎస్పీడీసీఎల్ యాదాద్రి భువనగిరి జిల్లా సర్కిల్ పరిధిలో, భువనగిరి పట్టణంలోని ఓంకార్ థియేటర్ పక్కన ₹5.83 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన సర్కిల్ కార్యాలయ భవనాన్ని ఉప ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. భూదాన్ పోచంపల్లి మండలం వంక మామిడి గ్రామంలో ₹2.67 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్ను కూడా ఈ సర్కిల్ కార్యాలయం నుంచే రిమోట్ ద్వారా ప్రారంభిస్తారు. ఈ సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడం వల్ల సుమారు 1,279 మంది రైతులకు నాణ్యమైన విద్యుత్ అంది లబ్ధి చేకూరుతుంది. భువనగిరి మండలం హనుమపురం గ్రామంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఎదురుగా ₹2.03 కోట్లతో నిర్మించనున్న 'స్టోర్ కాంప్లెక్స్'కు, అలాగే వలిగొండ మండలం నర్సాపూర్ గ్రామంలో ₹3.52 కోట్లతో చేపట్టనున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేస్తారు. ఈ కార్యక్రమాల అనంతరం విద్యుత్ శాఖ అధికారులతో కలిసి డిప్యూటీ సీఎం సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. ఆ తర్వాత ప్రజలను ఉద్దేశించి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగిస్తారు. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు



టీజీ ఎస్పీడీసీఎల్ యాదాద్రి భువనగిరి సర్కిల్ ఎస్ఈ సురేష్ తెలిపారు.

**ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్ :** డిప్యూటీ సీఎం పర్యటనను పురస్కరించుకొని సోమవారం భువనగిరిలో మున్సిపల్ చైర్‌పర్సన్ తంగేళ్లపల్లి శ్రీవాణి పర్యటించి ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేష్తో మాట్లాడి, కార్యక్రమ నిర్వహణ, ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉప ముఖ్యమంత్రి పర్యటనకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనులు పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తి, పీసీసీ డెలిగేట్ సభ్యులు తంగేళ్లపల్లి రవికుమార్ పాల్గొన్నారు.



## బాధితులకు న్యాయం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి కె. నరసింహ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఆయన ఫిర్యాదుదారుల నుండి వినతులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతిభద్రత, సమస్యల పరిష్కారం కోసం పోలీసు శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. సమస్యలను శాంతిసామరస్యాలతో పరిష్కరించుకోవాలి తప్ప చట్టవ్యతిరేకంగా నడుచుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## వేమూరికి సన్మానం



**ప్రజాపక్షం/మునగాల:** దొడ్డి కొమరయ్య సినిమాను 1000 మంది ప్రజల భాగస్వామ్యంతో కలిసి నిర్మిస్తున్నామని సినిమా దర్శకుడు ఎం.సేనాపతి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య సినిమా టీం సోమవారం మండల పరిధిలోని నర్సింహాపురం గ్రామంలో సర్పంచ్ వేమూరి సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సేకు శ్రీనివాసరావు, రావూరి భవాని, ఎం.అన్నపూర్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పాస్టర్ల సేవలను గుర్తించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పాస్టర్ల సేవలను ప్రభుత్వం గుర్తించి తగిన ప్రోత్సాహకాలు అందించాలని ఎస్‌క్యూఐ పెంతెకొస్తు డయాసిస్ ఇండియా బిషప్ రమేష్‌బాలన్ అన్నారు. దుబ్బ తండా విశ్వాస పరిచర్య ప్రార్థన మందిరంలో బిషప్ సామాజికవేత్త ధీరావత్ హన్యనాయక్ అధ్యక్షతన సోమవారం జరిగిన ఆర్డినేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తొలుత ప్రపంచ శాంతిని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలే జీవనాధారం అన్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో రమాబాయి, బిషప్‌లు జెజె.సామ్యేల్‌సన్, సతీష్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.



## అర్హులందరికీ సంక్షేమ పథకాలే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని 35వ వార్డు కౌన్సిలర్ జ్యోతి శ్రీవిద్య ఏర్పాటు చేసిన చర్చి కంపౌండ్‌లో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ముగింపు కార్యక్రమంలో హాజరై మాట్లాడారు. సూర్యాపేటను స్వచ్ఛతలో రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలిపేందుకు మున్సిపాలిటి ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. సూర్యాపేటను గంజాయి రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు.ఈ కార్యక్రమంలో డిఎస్‌పి ప్రసన్న కుమార్, మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి, పట్టణ సిఐ వెంకటయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీఉల్లా, కౌన్సిలర్ డాక్టర్ ఊర రామ్మూర్తి, జ్యోతి కరుణాకర్, బైరబోయిన శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## రహదారి మూసివేయడంపై సర్పంచ్ ఆగ్రహం



**ప్రజాపక్షం/అనంతగిరి:** మండలంలోని బొజ్జగూడెం తండా నుంచి అజ్మీరతండా, ఖానాపురం వెళ్లే రహదారిని కొంతమంది కంపవేసి మూసివేయడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ మార్గం మూసివేయడంతో గ్రామస్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు నిత్యావసర వైద్యసేవలు, నిత్య అవసరాల రవాణా పూర్తిగా ప్రభావితమయ్యాయి. గత పది రోజులుగా ఈ సమస్య కొనసాగుతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు జోక్యం చేసుకుని ఈ రహదారిపై వేసిక కంపను వెంటనే తొలగించాలని కోరారు. ఈ విషయమై అజ్మీరతండా సర్పంచ్ అజ్మీర శ్రీవిద్య ఆగ్రహం వ్యక్తం చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

**వినతిపత్రం ఇచ్చిన స్పందన కరువు: బొజ్జగూడెం గ్రామస్తుల ఆవేదన**

రహదారి మూసివేశారని తక్షణమే రహదారిని అందుబాటులోకి తీసుకరావాలని సంబంధిత తహసిల్దార్‌కు వినతిపత్రం ఇచ్చి వారం రోజులు గడుస్తున్న నేటికి చర్యలు తీసుకోవడంలేదని బొజ్జగూడెం తండా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామానికి చెందిన శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ రహదారి మూసివేయడంలో మూడు గ్రామాల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు.

## రైస్‌మిల్లుకు లైసెన్స్ వెంటనే క్యాన్సిల్ చేయాలి



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌లో ఉన్న సునంద రైస్ ఇండస్ట్రీ ట్రేడ్ లైసెన్స్ వెంటనే రద్దు చేయాలని గ్రీవెన్స్‌డేలో జిల్లా కలెక్టర్ సోమవారం వినతిపత్రం ఇవ్వడం జరిగిందని మండల ఎమ్మార్పీఎస్, జైబీమ్ కమిటి అధ్యక్షులు కొత్తపల్లి రవి ఆధ్వర్యంలో అంబేద్కర్ నగర్ ప్రజల తరుపున కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ జనావాస మధ్యలో సునంద రైస్ ఇండ్రస్టిస్‌లో బారీ రైస్‌మిల్లు వల్ల ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొవాల్సి వస్తుందని ఆరంజ్ జోన్‌లో ఉండే రైస్ మిల్లు ప్రజావాసమధ్యలో ఉండకూడదని, నియమ నిబంధనలు ఎలాంటివి పాటించకుండా మిల్లు నిర్మాణం జరగడం వల్ల రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 21 విఘాతం కలుగుతుందని, ఈ మిల్లు వల్ల ట్రాఫిక్ జామ్ అనేక ఆక్సిడెంట్ కూడా జరిగాయని, మిల్లు వల్ల చదువుకునే విద్యార్థులు కూడా తీవ్ర ఇబ్బంది అవుతుందని కావున ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రజా నివాసంలో ఉన్న గుడికి, బడికి దగ్గరలో ఉన్న మిల్లుకు సంబంధించిన లైసెన్స్ రద్దు చేసి ఊరికి దూరంగా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ విషయమై కలెక్టర్ స్పందించి తక్షణమే ఇలాంటి సమస్యలపై విచారణ చేయించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ సభ్యులు నకిరేకంటి రవి, పిట్ట వెంకటేష్, ఆలంపల్లి శేఖర్, పిట్ట నాగరాజు, మచ్చ వేణు, కుర్రి వెంకన్న పాల్గొన్నారు.

## వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా అధ్యక్షులు కృష్ణారెడ్డి,కార్యవర్గానికి సన్మానం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజేయు)అనుబంధ సంఘం జిల్లా నూతన కార్యవర్గంను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం,బంజారా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం మిర్యాలగూడలోని ఎన్ఎస్పి అతిథి గృహంలో ఘనంగా సన్మానించారు. తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజేయు) అనుబంధం జిల్లా అధ్యక్షులుగా గార్లపాటి కృష్ణారెడ్డి, ప్రెస్ క్లబ్ జిల్లా అధ్యక్షులుగా కలిమెల నాగయ్య, ప్రచార కార్యదర్శిగా ఎండి.అస్లాం, ప్రెస్ క్లబ్ కోశాధికారిగా పుప్పాల యాదగిరి, ప్రచార కార్యదర్శిగా నాగాచారీలు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా వారిని శాలువా, పూలదండతో ఘనంగా సన్మానించడంతో పాటు సీట్లు తినిపించి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సామాజికవేత్త డాక్టర్ రాజు, బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ నాయక్‌లు మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలికి తీయడంలో జర్నలిస్టులు ప్రధాన పాత్ర పోషించాలని పేర్కొన్నారు. గుర్తించిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారిదిగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ సంఘం పట్టణ అధ్యక్షులు బంటు వెంకటేశ్వర్లు, ఎస్సీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మాదుగుల శ్రీనివాస్, జర్నలిస్టులు,వేణుగోపాల్ రెడ్డి, రమేష్, బాలాజీ, రామకృష్ణ, హరీష్, కిషోర్, శ్రీను, సుమన్ పాల్గొన్నారు.



## జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండలంలోని పెద్దగారకుంటతండలో బొడ్రాయి పండుగ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ సోమవారం గ్రామ ఉపసర్పంచ్ బానోతు బిక్షం, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు బర్మావత్ నాగరాజులు ప్రారంభించారు. జూన్ 7 నుండి 12 వరకు ఆరో రోజుల పాటు సాగే ఈ టోర్నమెంట్‌లో జిల్లా నుండి పాల్గొనదలుచుకున్న క్రీడాకారులు మరిన్ని వివరాల కోసం, రిజిస్ట్రేషన్ కొరకు బర్మావత్ నాగరాజు 9063639224ను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.12వేలు, ద్వితీయ బహుమతిగా రూ.8వేలు, తృతీయ బహుమతిగా రూ.6వేలు, నాల్గవ బహుమతిగా రూ.3వేలు, నగదు బహుమతులతో పాటు టీషర్ట్స్, క్రికెట్ కిట్లను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు బానోతు నరసింహ, బర్మావత్ లాలు, మాలోతు నరసింహ, మాలోతు సాయి, అనిల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం...



**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** మండలంలోని జడ్పీహెచ్ఎస్ జలాల్ పూరం హైస్కూల్ 2006/2007 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం మండలంలోని రంగాపూర్ గ్రామ శివారులో ఉన్న ఓం శివ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమ ఆరో తరగతి నుండి పదవ తరగతి వరకు కలిసి చదువుకున్న విద్యార్థిని విద్యార్థులకు ఆపద వస్తే అండగా ఉంటామని. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, స్వరాజ్యం టీచర్, ఉపేందర్ రావు, రాజు, విద్యార్థులు దేవేందర్ రెడ్డి, వెంకటేష్, రమేష్, నాగేష్, శ్రీరాముల నాయక్, బిక్షపతి నాయక్, సురేష్, వేణుగోపాల్ రెడ్డి, నాగరాణి, దేమంత్, లక్ష్మి , పార్వతి, పద్మ పాల్గొన్నారు.

## కన్నులపండువగా గంగమ్మ తల్లి జాతర



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ మండలంలోని రాయినిపాలెం, దామరచర్ల మండలంలోని తాళ్ళవీరప్పగూడెం గ్రామాలలో శ్రీ గంగమ్మ తల్లి జాతర ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా సాగాయి. యాదవుల ఆరాధ్య దైవమైన గంగమ్మ తల్లి వేడుకలలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను జరిపారు. ఆలయ పరిసరాల్లోకి చేరుకున్న ఎమ్మెల్యేకు అర్చక స్వాములు, యాదవ సంఘ నేతలు పూర్ణకుంభంతో ఆలయంలోకి సాదరంగా ఆహ్వానించారు.అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఎమ్మెల్యేకు అర్చకులు వేదాశీర్వచనం చేసి, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, యాదవ సంఘం ప్రముఖులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక

**ప్రజాపక్షం/నడిగూడెం:** మండల కేంద్రంలో ఉన్న శ్రీ కొల్లు పాపయ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి యాదాల విహార్ ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మసురం శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా యాదాల విహార్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.



## టీ షర్ట్స్ అందజేత

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల టీ 10 క్రికెట్ టోర్నమెంట్ పోటీలు మిర్యాలగూడలో నిర్వహిస్తున్న సందర్భంగా క్రీడాకారులకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్ సోమవారం టీ షర్ట్స్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర స్థాయిలో దివ్యాంగుల క్రికెట్ పోటీలు నిర్వహించడం చాలా సంతోషకరమన్నారు. ఎంతో మంది వికలాంగుల క్రీడల పట్ల ఆసక్తి ఉన్న కూడా తోటి వారితో కలిసి ఆడలేని పరిస్థితుల్లో ఉన్న వికలాంగులను గుర్తించి వారికి ప్రత్యేకంగా క్రీడా పోటీలు నిర్వహించడం చాలా మంచి పరిణామం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి అశోక్, కోల సైదులు, అంజి బాబు, నాయిని భాస్కర్, ఇమ్రాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ధరలు తగ్గించాలి



**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ మండల కార్యదర్శి అన్నెమైన వెంకటేశం అన్నారు. మండల కేంద్రంలో ఈ నెల 10 వ తారీకు కలెక్టర్ కార్యాలయంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు దానికి సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దీరావత్ విట్టల్ నాయక్, పి.కృష్ణచారి, ఎన్.లక్ష్మయ్య, డి.మోతిలాల్ నాయక్, డి.లింగా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలపై అవగాహన



**ప్రజాపక్షం/నడిగూడెం:** ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు. సోమవారం మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వి.రామారావు, ఉప సర్పంచ్ కె.రమేష్, కార్యదర్శి మన్సూర్అలీ, ఎవో మల్సూర్, ఆర్ఐ గోపాలకృష్ణ, ఎఎస్ఐ శ్రీనివాసరెడ్డి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు డర్రా ఉపేందర్, ఎఎన్ఎం లు విజయకుమారి పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు సద్వినియోగం

**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ రాజేందర్‌రెడ్డి, సర్పంచ్ సోమిరెడ్డి వీరారెడ్డి లు అన్నారు. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ఎర్రగట్టు గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎవో పద్మ, ఎడిఏ రవికుమార్, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ అశ్విని, స్కూల్ హెచ్ఎం శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శి మోషన్, గ్రామ ఉప సర్పంచ్ బాణావత్ సైది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## 96 వేల మంది రైతులకు లబ్ధి..

### రైతుల ఖాతాల్లో రూ. 1,570 కోట్లు జమ: అదనపు కలెక్టర్ శ్రీనివాస్




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నల్లగొండ జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సింహభాగం రైతాంగానికి మద్దతు ధర లభించిందని, 96,769 మంది రైతుల నుండి సేకరించిన ధాన్యానికి గానూ అత్యధిక నిధులను సత్వరమే రైతుల ఖాతాలకు బదిలీ చేశామని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ స్పష్టం చేశారు. సోమవారం మిర్యాలగూడలో ఆర్డీవో రమణారెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలో మొత్తం రూ. 1,789 కోట్ల విలువైన ధాన్యం సేకరించగా, ఇప్పటివరకు రూ. 1,570 కోట్లు రైతుల సొంత ఖాతాల్లో జమ అయ్యాయని, మిగిలిన రూ. 190 కోట్ల నిధుల విడుదలకు ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 459 కేంద్రాల ద్వారా రికార్డు సృష్టిస్తూ 7.50 లక్షల మెట్రిక్ టన్నుల మార్కును దాటామన్నారు.మిల్లర్ల నుండి లభించిన 22 వేల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ బియ్యంతో పాటు యాదాద్రి జిల్లా నుండి వచ్చే 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలను కూడా మిర్యాలగూడ రైస్ మిల్లులలో సజావుగా అన్ లోడ్ చేసుకునేలా ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి ఓటరు సమగ్ర సర్వే విజయవంతం కావడానికి ప్రజలు తమ కుటుంబ ఓట్ల వివరాలను అధికారులకు స్పష్టంగా తెలియజేయాలని కోరారు. ఈ అధికారిక కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి రమణారెడ్డి, పరిపాలన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల గైర్హాజరుపై అదనపు కలెక్టర్ అసంతృప్తి..




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వ సంక్షేమ పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు నిర్వహిస్తున్న డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమం పట్ల అధికారులు తమ వైఖరిని మార్చుకోవాలని, బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ స్పష్టం చేశారు. సోమవారం మిర్యాలగూడలో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి ఆయన హాజరై జిల్లా అధికారుల హాజరు శాతాన్ని సమీక్షించారు. ముఖ్య అధికారులు కొందరు విధులకు రాకుండా కింది స్థాయి సిబ్బందిని ప్రతినిధులుగా పంపడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్ణయాలు తీసుకునే అధికారం లేని కింది స్థాయి సిబ్బంది వల్ల సమస్యల పరిష్కారంలో కాలయాపన జరుగుతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు.ప్రజావాణికి వచ్చిన 12 దరఖాస్తులను ఆయా విభాగాల అధికారులకు విభజించి ఇచ్చి, వాటి పురోగతిపై తదుపరి వారంలోగా నివేదిక సమర్పించాలని గడువు విధించారు. ప్రజల ఇబ్బందులను నిర్లక్ష్యం చేసే అధికారుల ఫైళ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ పి. శ్రీనివాస్, ఐపీడీఎస్ పీవో వేణు, ఏడీఏ జగదీశ్వర్, ఏవో రుషేంద్రమణి, ఉద్యానశాఖ అధికారి నసీమా మెహ్రిన్, ఎంపీడీవో సూపరింటెండెంట్ కరుణాకర్, నీటిపారుదల శాఖ ఆర్అండ్‌బి,నీటిపారుదల, ఆర్ డబ్ల్యూఎస్, హౌజింగ్ డిఇఇలు శ్రీనివాస్, ఎండి.అహ్మదుల్లా, వి.సతీష్, శంకర్, డివిజనల్ పంచాయతీ ఎస్ఎ గులాం అలీ, విద్యుత్ ఎఇ నవీన్, ఐసీడిఎస్ సూపర్ వైజర్ నాగమణి, ఏక్సైజు ఎస్ఐ షేక్ పర్వీన్ పాల్గొన్నారు.

## కొత్త హెల్త్ కార్డులు రావు.. పాతవి చెల్లవు..

### ఇహెచ్ఎస్ అమలుపై పెన్షనర్ల తీవ్ర ఆందోళన

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) హెల్త్ కార్డుల నిర్వహణ లోపాల వల్ల రాష్ట్రంలోని లక్షలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారని టాప్రా జిల్లా అధ్యక్షుడు నూకల జగదీష్ చంద్ర ఆవేదన వ్యక్తంచేశారు. మిర్యాలగూడ పట్టణంలో సోమవారం నాడు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈహెచ్ఎస్ అమలు తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జూన్ 2వ తేదీ నుండే నూతన హెల్త్ కార్డుల ద్వారా ఉచిత వైద్యం అందిస్తున్నామని నమ్మబలికిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉద్యోగుల వేతనాలు, పెన్షనర్ల పెన్షన్ల నుండి బలవంతంగా 1.5 శాతం నిధులను కట్ చేయడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల నెపంతో మే నెల జీతాల నుండే ఈ కటింగ్స్ ప్రారంభించారని, అయితే క్షేత్ర స్థాయిలో మాత్రం పైసా ఉచిత వైద్యం అందడం లేదని ధ్వజమెత్తారు. కొత్త డిజిటల్ కార్డులు ఇంతవరకు చేతికి రాకపోవడం, పాత కార్డులను ఆసుపత్రులు అంగీకరించకపోవడంతో అత్యవసర స్థితిలో చేరిన రోగులు లబోదిబోమంటున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు చేరిన వారి నుండి లక్షలాది రూపాయలు నగదు కట్టించుకుంటేనే వైద్యం చేస్తున్న విషయాన్ని ప్రభుత్వం గమనించాలన్నారు. ఈ సమావేశంలో టాప్రా నాయకులు కృష్ణమూర్తి, గర్దాస్ సత్యనారాయణ, రమణారెడ్డి, సత్యనారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



**ప్రజాపక్షం/తిప్పర్తి:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని ఎంపీడీవో జానయ్య అన్నారు.సోమవారం మండలంలోని ఎల్లమ్మగూడెం, మామిడాల, యాపలగూడెం గ్రామాలలో నిర్వహించిన జలసంచయంజన్ భాగీదారి కార్యక్రమంలో ఆయన పాల్గొని నీటి సంరక్షణ,భూగర్భ జలాల పెంపుపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈసందర్భంగా చెట్లు పెంచాలని పిలుపునిచ్చారు.ఏపీఎం కడెం రామ్మోహన్ మాట్లాడుతూ, నీటిని బతకనిద్దాం,భావితరాలకు బతుకునిద్దాం అనే నినాదంతో ప్రతి గ్రామపంచాయతీలో ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మించుకోవాలని, నీటిని పొదుపు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎల్లమ్మగూడెం సర్పంచ్ వాణి సందీప్ రెడ్డి,మామిడాల సర్పంచ్ కొత్తపల్లి సైదులు,యాపలగూడెం సర్పంచ్ జ్యోతి,సూపర్‌వైజర్ మిస్కిన్,కార్యదర్శులు ఉపేందర్,టెక్నికల్ అసిస్టెంట్ సువర్ణ, లింగయ్య,వీరయ్య,ఫీల్డ్ అసిస్టెంట్లు,గ్రామస్తులు పాల్గొన్నారు.



## విద్యార్థుల జీవితాలతో చెలగాటం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఫీజు రియంబర్స్మెంట్ కు నిధులు విడుదల చేయకుండా పాలక ప్రభుత్వాలు పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తూ వారి ఉజ్వల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నాయని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు యశ్వంత్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పార్టీ కార్యాలయం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని మారినా విద్యార్థుల తలరాతలు మారడం లేదని అన్నారు. కళాశాల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్న పట్టించుకునే నాధుడే లేడా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం . ఉన్నతాధికారులు స్పందించి ఫీజు రీయింబర్స్మెంట్ విడుదలకు చర్యలు చేపట్టాలని అన్నారు. సమావేశంలో నాయకులు అబ్దుల్, ఆంగోతు అనిల్, వినయ్, రఫీ పాల్గొన్నారు.

## వరి సాగులో శాస్త్రీయ ఎరువుల యాజమాన్యం అవసరం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులకు స్వస్తి పలికి శాస్త్రీయ విధానాలను అవలంబించినప్పుడే సాగు పెట్టుబడులు తగ్గి రైతులకు ఆశించిన స్థాయిలో నికర లాభాలు దక్కుతాయని కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కే చంద్రశేఖర్ పేర్కొన్నారు. కొత్తపేట గ్రామంలో వ్యవసాయ శాఖ సమన్వయంతో జరిగిన కేత్ బచావో అభియాన్ చైతన్య సదస్సులో ఆయన పాల్గొని వరి పంటలో ఎరువుల సక్రమ వినియోగంపై రైతులతో ముఖాముఖి మాట్లాడారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగానే ఏ ఏ ఎరువులు ఎంత మోతాదులో వేయాలో నిర్ణయించుకోవాలని, గుడ్డిగా మార్కెట్లో దొరికే రసాయనాలను వాడటం వల్ల ఆర్థిక నష్టంతో పాటు భూమి చౌడుబారుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ వ్యవసాయ అధికారిని ఋషింద్రమని, వ్యవసాయ ఎక్స్టెన్షన్ అధికారి పార్వతి, ఆదర్శ రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదాం

**ప్రజాపక్షం/హాలియా:** ఎటువంటి అపరిశుభ్రత లేని స్వచ్ఛమైన మున్సిపాలిటీగా హాలియాను తీర్చిదిద్దాలని మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం హాలియా మున్సిపాలిటీలో 10,11,12 కౌన్సిలర్లు వార్డు సభ్యులతో ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈమూడు వార్డులో నెలకొన్న సమస్యలని ప్రజల ద్వారా తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా కౌన్సిలర్లు పనిచేస్తారని తెలిపారు.ప్రధానంగా శానిటేషన్,అంతర్గత రహదారులు,డ్రైనేజీ వ్యవస్థ ఇతర సమస్యలపై ప్రజలు అధికారులకు కౌన్సిలర్లకు తెలియజేయాలని చెప్పారు.రహదారుల వెంట ఉన్న వ్యర్థాలను తొలగించాలని స్వచ్ఛ మున్సిపాలిటీ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు.ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి,ఎస్ఐ సాయి ప్రశాంత్,11వ వార్డు కౌన్సిలర్ ప్రసాద్ నాయక్,విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## జోసెఫ్ పాఠశాలలో ఉచిత మెడికల్ క్యాంపు

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండలంలోని పొనుగోడు గ్రామంలో సెయింట్ జోసఫ్ పాఠశాలలో సోమవారం స్ఫూర్తి సోసైటీ ఆధ్వర్యంలో ఆశ్రమం హ్యాండ్ ఆఫ్ హోప్ సహకారంతో మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 350 మంది గ్రామస్తులకు జనరల్ చెకప్‌లు, రక్త పరీక్షలు, దంత పరీక్షలు, ఎక్స్‌రేలు, ఈసిజి, కంటి పరీక్షలను నిర్వహించారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారికి 88 మందికి కళ్లఅద్దాలు ఉచితంగా అందజేసి మందులు పంపిణీ చేశారు. స్థానిక యువత చురుకుగా పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయడం పట్ల స్ఫూర్తి సోసైటీ సెక్రటరీ ముప్పాళ్ల దయాకర్ వారిని అభినందించారు.

## ఉచిత వైద్య శిబిరం సద్వినియోగం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి మండలం జిబ్లక్ పల్లి గ్రామ కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ ఆర్ల కావ్య వెంకటేశం ఉపసర్పంచ్ ఆర్ల లింగస్వామి కోరారు. సోమవారం క్యాంపును ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ వైద్య పరీక్షలకు వచ్చేవారు ఆధార్ కార్డు ఫోన్ నెంబరు తీసుకొని వెంట తెచ్చుకోవాలని తెలిపారు.ఈ క్యాంపులో ఛాతి ఎక్స్ రే ఎన్ సి డి స్క్రినింగ్ పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. మొదటి రోజు ఓపీ 197, ఎక్స్రే 152 కు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గం కార్యదర్శి ఇతర సిబ్బంది ఉన్నారు.

## మండల వ్యాప్తంగా వేగవంతమైన వడ్ల కొనుగోళ్ళు

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండలంలో వడ్ల కొనుగోలు కేంద్రాలలో వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని మండల అధికారులు ప్రజాప్రతినిధులు స్థానిక శాసనసభ్యులు వేముల వీరేశం రైతులకు వడ్ల కొనుగోలు కేంద్రాలలో ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షణ చేస్తూ వడ్లను అందుబాటులో ఉన్న మిల్లుల ద్వారా కొనుగోలు వేగవంతం చేయించడం జరుగుతున్నది. మండల వ్యాప్తంగా సుమారు 70 నుంచి 80 శాతం వడ్ల కొనుగోలు పూర్తి అయినది అని మండలంలో అధిక దిగుబడి రైతులు తీసుకురావడం వలన మూసి పరివాహక ప్రాంతమైన గ్రామాల్లో అధిక దిగుబడితో పాటు కాయతాలు శాతం ఎక్కువ రావడం వలన రైతులు కొంతవరకు ఇబ్బంది పడిన మాట వాస్తవమేనని. రాబోయే వారం రోజుల్లో మండల వ్యాప్తంగా పూర్తిస్థాయిలో వడ్ల కొనుగోలు జరుగుతుందని అధికారులు రైతులు ప్రజాప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు.



# కోదాడలో యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాలు కబ్జా

### సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం డిమాండ్



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ నియోజకవర్గంలో యదేచ్ఛగా అధికార పార్టీకి చెందిన నేతలు భూకబ్జాలు అక్రమణలకు పాల్పడుతుంటే నిలువరించాల్సిన సంబంధిత అధికారులు చేష్టలుడిగి వారికి వత్తాసు పలుకుతున్నారని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం కోదాడలో తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ కోదాడ పెద్ద చెరువును ఇప్పటికే రెండు వందల ఎకరాలు కబ్జా చేశారని తాజాగా సూర్యాపేట రోడ్డులోని పెట్రోల్ బంకు పక్కన 20 కోట్ల విలువ చేసే 2వేల గజాల చెరువు కబ్జాకు గురవుతున్నప్పటికీ నీటిపారుదల శాఖ అధికారులు గాని, మున్సిపల్ అధికారులు గాని చర్యలు తీసుకోకపోవడం వెనుక అంతర్యం ఏమిటన్నారు. కోదాడ నడిబొడ్డున యాదవ నగర్‌లో లక్షల విలువ చేసే మున్సిపాలిటి స్థలంలో ఆ వార్డుకు చెందిన ఓ కాంగ్రెస్ నేత రెండు నెలల క్రితమే అక్రమించుకుని బారీ బడ్డికొట్టును ఏర్పాటు చేసినప్పటికీ మున్సిపల్ కమిషనర్ ఎందుకు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఇక నియోజకవర్గంలో గుడిబండ, కాపుగల్లు, సింగారంతో పాటు పలు గ్రామాల శివారులలో ప్రభుత్వ భూములను అనుమతులు లేకుండా మట్టిని తోడుకుని లక్షలు దండుకుంటున్న అధికారులకు మాత్రం చీమకుట్టినట్లుగా లేదన్నారు. మున్సిపాలిటిలో ఎలాంటి టెండర్ లేకుండా సెంట్రల్ లైటింగ్ పనులకు 50 లక్షలు ఖర్చు చేయడంపై విచారణ జరపాలని, చివరకు సమోసాలకు 40వేలు ఖర్చు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రమేష్, భూపాల్‌రెడ్డి, ఉపేందర్, కందిబండ సత్యనారాయణ, కోల ఉపేందర్ రావు, లక్ష్మి నారాయణ, ఉపేందర్‌గౌడ్, కరీముల్లా బాబా, మాణిక్యం పాల్గొన్నారు.

# పారా క్రీడాకారులకు రెండుశాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** తెలంగాణ రాష్ట్రంలో పారా క్రీడాకారులకు జీవోనెంబర్ 74 ప్రకారం కల్పించాల్సిన రెండుశాతం రిజర్వేషన్లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షులు, జాతీయ స్థాయి పారా వాలీబాల్ క్రీడాకారుడు కుర్రగోపియాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి ప్రభుత్వ ఉద్యోగ నియమకాలలో పార క్రీడాకారులకు ఇవ్వాల్సిన రిజర్వేషన్లు సమర్ధవంతంగా అమలు కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయిలలో ప్రతిభ కనబర్చిన దివ్యాంగ క్రీడాకారులు ఉద్యోగ ఉపాధి అవకాశాలలో తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 2025 నూతన క్రీడా విధానం అమల్లోకి వచ్చిందని పది నెలలు గడుస్తున్నా పార క్రీడాకారుల సంక్షేమంపై స్పష్టమైన చర్యలు కనిపించడం లేదన్నారు. ఇటీవల విడుదలైన ఎఈఈ ఉద్యోగ నోటిఫికేషన్‌లో పారా క్రీడాకారులకు తగిన ప్రాధాన్యత కల్పించకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వం వెంటనే సంబంధిత నోటిఫికేషన్లను తక్షణమే నిలిపివేసి జీవోనెంబర్ 74 ప్రకారం సవరణలు చేయాలని కోరారు. పారీస్ పారాలింపిక్స్‌లో కాంస్య పథకం సాధించిన అర్జున అవార్డు గ్రహీత జీవాంజీ దీప్తికి ప్రకటించిన గ్రూప్2 ఉద్యోగ నియామకాన్ని ఇప్పటివరకు అమలు చేయకపోవడం బాధకరమన్నారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్పందించి జీవోనెంబర్ 74 ప్రకారం 2శాతం రిజర్వేషన్లను అమలు చేసి నష్టపోయిన పారా క్రీడాకారులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పారాక్రీడాకారులతో కలిసి తదుపరి కార్యచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు.

# ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు అరికట్టాలి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు అరికట్టి వెంటనే పూర్తి చేయాలని కోరుతూ సోమవారం జరిగిన శివారెడ్డి గూడెం గ్రామసభలో రైతులు అధికారులను నిలదీశారు. గ్రామసభ మొదలై వివరాలు వెల్లడిస్తున్న క్రమంలో తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఐకెపి సెంటర్లలో దాదాపు ఇంకా 50 శాతం వరి ధాన్యం కొనుగోలు కావాల్సిందని వర్షాలు పడనున్న నేపథ్యంలో రైతులు తీవ్ర ఆవేదనకు గురై అధికారులను కాసేపు పట్టుపట్టారు. లోడ్ చేసిన లారీలు తిరిగి రావడానికి తీవ్ర జాప్యం జరుగుతుండడంతో వరి ధాన్యం బస్తాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయని అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు జోక్యం చేసుకొని క్షేత్రస్థాయి పరిశీలనకు రైస్ మిల్లుల వద్దకు వెళ్లి మాట్లాడి ఎలాంటి సమస్యలు లేకుండా తలెత్తకుండా దళిత గతంలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అంతటితో గ్రామసభ ప్రశాంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో విజయ, సర్పంచ్ బొక్క మల్లారెడ్డి, కార్యదర్శ రజిత రెడ్డి, ఉప సర్పంచ్ చిలుకల సంతోష్ యాదవ్, ఎమ్మార్వై వెంకట్ రెడ్డి, వ్యవసాయ విస్తీర్ణ అధికారి క్రాంతి, నాయకులు వారాల రామచంద్ర రెడ్డి, మేకల కృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## నగర నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పరిశుభ్రమైన నగర నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని మున్సిపల్ కమిషనర్ బి.శరత్ చంద్ర కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మూడవ విడతగా డివిజన్ 6నుంచి పలువార్డుల ప్రత్యేక సభలు నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వార్డు స్థాయిలోనే పరిష్కార చర్యలు చేపట్టడం,ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ప్రజల భాగస్వామ్యంతో నగరాభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించడమే ఈవార్డు సభల ప్రధాన ఉద్దేశమని కమిషనర్ తెలిపారు.వార్డు సభల సందర్భంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్, ఫోర్‌వేస్ట్ సెగ్రిగేషన్ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాలలో సంబంధిత డివిజన్ల కార్పొరేటర్లు,వార్డు అధికారులు, మున్సిపల్ అధికారులు,శానిటరీ సిబ్బంది,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు



## నిత్యావసరాలు, ఇంధన ధరలు తగ్గించాలి

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** కేంద్ర ప్రభుత్వం పెంచిన నిత్యవసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ.. ఈనెల 10వ తేదీన కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ప్రజలకు విజ్ఞప్తి చేసింది. సోమవారం యాదగిరిగుట్ట పట్టణంలో ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని సిపిఐ నాయకులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ మాట్లాడుతూ, బిజెపి పాలనలో సామాన్య ప్రజల బతుకులు భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు.అచ్చేదిన్ ఎక్కడ? సామాన్యుడిపైనే పన్నుల భారం! దేశంలో అడ్డుఅదుపు లేని ధరల పెరుగుదలకు కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమని కళ్లెం కృష్ణ విమర్శించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేరబోయిన మహేందర్, సిపిఐ మండల కార్యదర్శి కలపెల్లి మహేందర్, పట్టణ కార్యదర్శి బబ్బురి శ్రీధర్, మండల కార్యవర్గ సభ్యులు పేరబోయిన పెంటయ్య, పట్టణ సహాయ కార్యదర్శి పేరబోయిన బంగారి, గీత పనివాళ్ల సంఘం మండల కార్యదర్శి గుండు వెంకటేష్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి గోపగాని రాజు పాల్గొన్నారు.

## ఆకతాయిలపై కఠిన చర్యలు



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణంలోని శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, ప్రజలకు ఇబ్బందులకు గురిచేసే ఆకతాయిల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని కోదాడ పట్టణ ఎస్ఐ మల్సూర్ హెచ్చరించారు. ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 26వ వార్డులో జరిగిన వార్డు సభకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. వార్డుల్లో రాత్రి వేళ్లలో అపరిచిత వ్యక్తులు సంచరించినా, ఆకతాయిలు అల్లర్లు సృష్టించినా పౌరులు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతారని, కాలనీల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలపాలు సాగకుండా వార్డు ప్రజలు సైతం పోలీసులకు సహకరించాలని కోరారు. వర్షకాలం సమీపిస్తున్నందున సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి జాగ్రత్త వహించాలన్నారు. మాజీ కౌన్సిలర్ షేక్ షమ్మి, బాగ్దాద్, మజహర్‌బాబా, పర్వుద్దీన్, ఆర్‌పి జాన్‌బేగం, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రత స్వచ్ఛత పాటించాలి

**ప్రజాపక్షం/బీబీనగర్ :** ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రత స్వచ్ఛత పాటించి గ్రామ అభివృద్ధి కోసం కృషి చేయాలని జిల్లా పరిషత్ కార్య నిర్వహణ అధికారి శోభారాణి అన్నారు. సోమవారం మండలంలోని బట్టుగూడెం గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేయాలని గ్రామంలో మంచినీటి సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలి అన్నారు. అదేవిధంగా మండలంలోని గుర్రాల దండి, బ్రాహ్మణపల్లి, లక్ష్మి దేవిగూడా, చిన్న రావులపల్లి, రామగుండం తండా, జంపల్లి గ్రామాల్లో ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామసభలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ప్రధాన కూడలి వద్ద డస్ట్ బిల్లును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, తాసిల్దార్ శ్యాంసుందర్రెడ్డి, సిఐ ప్రభాకర్ రెడ్డి, సర్పంచులు లతా శ్రీశైలం, బానోత్ గోపి నాయక్, ఉపసర్పంచి రాములు తదితరులు పాల్గొన్నారు.





## మృగశిర కార్తె..చేపల మార్కెట్ సందడి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** భగభగ మండే ఎండలు రోహిణి కార్తి తిరోగమనం పట్టి మృగశిర కార్తె ప్రారంభమైన తొలి రోజు పోచంపల్లి పట్టణ కేంద్రంలో ప్రధాన వీధుల్లో చేపల మార్కెట్ కొనుగోలుదారులతో సందడిగా మారాయి. అనాదిగా మృగశిర కార్తె రోజు కచ్చితంగా చేపలను వండుకుని తినాలనే సెంటిమెంట్ ఉండటంతో ఉదయమే చేపల వ్యాపారులు నగర ప్రధాన వీధుల వెంట రాశులుగా పోసుకొని అమ్మకానికి పెట్టారు. చేపల మాంసాహార ప్రియులు పొద్దున్నే కొనుగోలు చేసేందుకు బారులు తీరారు. ప్రధాన కూడళ్ల వద్ద చేపల వ్యాపారులతో కిటకిటలాడాయి.

## వార్డు సమస్యల పరిష్కారమే లక్ష్యం




**ప్రజాపక్షం/నకిరేకల్ :** వార్డు స్థాయిలో ప్రజల అవసరాలను గుర్తించి సమస్యలకు వేగవంతమైన పరిష్కారం చూపడమే ప్రధాన లక్ష్యమని మునిసిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 5,6,14,15,16 వార్డుల లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక వార్డు సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వార్డులలో చేపడుతున్న డ్రైనేజీల పూడికతీత పనులు,మురికి కాలువల శుభ్రత,వర్షాకాల సన్నద్ధత చర్యల గురించి వివరించారు.ఈకార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ అజ్మీరా కిరణ్, వార్డు ఆఫీసర్లు పర్యావరణ ఇంజనీర్ నాగరాజు, బిల్ కలెక్టర్లు, అసిస్టెంట్ బిల్ కలెక్టర్లు,ఆర్‌పిలు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## చీటింగ్ కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష

**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో దాఖలయిన కేసుకు సంబంధించి నిందితుడైన ఎండి. ఫయాజుద్దీన్‌కు మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.1500 జరిమాన విధిస్తున్నట్లు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జీ పి. స్నేహ తీర్పును వెల్లడించారు. ఎండి జియాఉల్ హక్‌కు ఒక నెల జైలు శిక్ష, రూ. 1000 జరిమానా విధించారు. 2023లో కేసు నమోదు కాగా ఏపిపి సంతోష్‌కుమార్ వాదనలతో ఏకీభవించి తీర్పునిచ్చారు. లైజన్ ఆఫీసర్స్ దాసోజు శ్రవన్, నాగమణి సహకరించారు.

## 10న వాహనాల వేలం

**ప్రజాపక్షం/దేవరకొండ;** వివిధ కేసుల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీజ్ చేసిన వాహనాలకు ఈనెల 10వ తేదిన బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు దేవరకొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్గొండ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సమక్షంలో ఈ వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు వేలంలో పాల్గొనే వారు ద్విచక్ర వాహనాలకు రూ. 10వేలు, నాలుగు చక్రాల వాహనాలకు రూ. 30వేల సెక్యూరిటి డిపాజిట్ చేసుకోవాలని తెలిపారు.

## రైతులకు లాభసాటి పంటలపై అవగాహన కల్పించాలి

### జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** రైతులకు లాభసాటి పంటలపై అవగాహన కల్పించాలని అధికారులకు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సోమవారం మండలంలోని రామన్నగూడెం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకే ప్రజాపాలన ప్రగతి నివేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఇందులో భాగంగానే 99 రోజుల పాటు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రజాపాలనలో భాగంగా అధికారులు నేరుగా ప్రజల వద్దకే వెళ్లి, వారి సమస్యలను తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరిస్తారని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేరాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రస్తుత సీజన్‌లో మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులు సాంప్రదాయ వరి సాగుకు ప్రత్యామ్నాయంగా లాభసాటిగా ఉండే ఇతర పంటలపై దృష్టి పెట్టాలని సూచించారు. రానున్న వర్షాకాలంలో ఎల్నీనో ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని గుర్తు చేశారు. వర్షాలు సకాలంలో పడకపోతే, వరి పంట చేతికొచ్చే సమయానికి ఆశించిన దిగుబడి రాక రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ నష్టాలను నివారించేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా విడుతల వారీగా ఏలాంటి ప్రత్యామ్నాయ పంటలు వేస్తే లాభదాయకంగా ఉంటుందో వ్యవసాయ అధికారులు రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తారని తెలిపారు. రాబోయే రోజుల్లో రామన్నగూడెం గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందంజలో ఉంచి, ఒక ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. గ్రామంలోని వార్డుల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను ఈనెల 25వ తేదీలోపు సబ్మిట్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి యాదగిరి, ఎంపిడిఓ బాలకృష్ణ పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు, నాణ్యత లేని పురుగు మందులు విక్రయిస్తే చర్యలు



**ప్రజాపక్షం/డిండి;** ఖరీఫ్ 2026 సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని డిండి మండలంలో మండల వ్యవసాయ అధికారి రెహానా, మండల తహాశీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, స్థానిక ఎస్ఐ బాలకృష్ణలు సంయుక్తంగా విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల విక్రయ కేంద్రాలైన అన్నదాత ట్రేడర్స్, ఏఆర్ఎస్‌కే డిండి సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా దుకాణాలలో నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, లైసెన్స్‌లు, బిల్ బుక్స్, విక్రయ రికార్డులు పరిశీలించి నకిలీ విత్తనాలు, గడువు ముగిసిన లేదా నాణ్యతలేని ఎరువులు, పురుగమందుల విక్రయాలపై అప్రమత్తంగా ఉండాలని డీలర్లకు సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు వ్యవసాయ ఉత్పాదకాలను కొనుగోలు చేసే సమయంలో తప్పని సరిగా బిల్లు తీసుకోవాలని, ధృవీకరించబడిన డీలర్ల వద్ద నుండే కొనుగోలు చేయాలని సూచించారు. ప్రస్తుత వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు ఒకటి లేదా రెండు వర్షాలకు తొందరపడి విత్తనాలు విత్తకుండా, భూమిలో తేమ ఏర్పడిన తర్వాత మాత్రమే విత్తుకోవాలని సూచించారు. సరిపడా తేమ లేకుండా విత్తడం వల్ల మొలకలు దెబ్బతిని దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని వివరించారు.

## మత్తు పదార్థాలపై పోలీసులు తనిఖీలు



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** నల్గొండ జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు సోమవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో సిఐ నవీన్‌కుమార్, ఎస్ఐ అజ్మీరా రమేష్, నల్గొండ జిల్లా ప్రత్యేక యాంటీ డ్రగ్స్ డాగ్ స్క్వాడ్ టీం ఆధ్వర్యంలో బస్టాండ్, పాన్ డబ్బాలు, కిరాణ దుకాణాలలో గంజాయి, మత్తు పదార్థాల అమ్మకాలపై ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సాగర్ రోడ్డులోని లాడ్జీలలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా సిఐ నవీన్‌కుమార్ మాట్లాడుతూ గంజాయి, మత్తుపదార్థాలను ఎవరైనా అమ్మినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చదువు, క్రీడలపై దృష్టిపెట్టాలని సూచించారు. మత్తు పదార్థాలతో జీవితం అందకారం అవుతుందని, కుటుంబంలోని యజమాని మత్తు పదార్థాలకు బానిసలు అయినట్లయితే కుటుంబం మొత్తం అందకారం అవుతుందని అన్నారు. పట్టణ కేంద్రంలో ఎవరయిన గంజాయి, మత్తు పదార్థాలు అమ్మిన, సేవించిన అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చించారు. ఈ తనిఖీలలో యాంటీ డ్రగ్స్ డాగ్ స్క్వాడ్ టీం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా గంగాదేవమ్మ పండుగ

**ప్రజాపక్షం/నకిరేకల్ :** నకిరేకల్ మండలంలోని పాలెం గ్రామంలో గంగాదేవమ్మ పండుగను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం వారు మాట్లాడుతూ గంగాదేవమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలు ఐకమత్యంతో పండుగను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నోములకృష్ణవేణిగోవిందరాజులు,కళ్యాణ్‌రావు,పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు, నాయకులు రాచకొండ శ్రీనివాస్ గౌడ్,నవీన్‌రావు, నోముల కేశవరాజులు, గాదగోని కొండయ్య, మాద నాగేష్,పేర్ల కృష్ణకాంత్, గణేష్ , పల్లె విజయ్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు యువత దూరం



**ప్రజాపక్షం/చివ్వెంల :** మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్న కుమార్ కోరారు. సోమవారం మండలంలోని మున్యానాయక్‌తండ గ్రామ పంచాయితీలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ సర్పంచ్ ధరావత్ సుశీల సాగర్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత బాధ్యతాయుతంగా ఉండి గ్రామాభివృద్ధికి కృషి చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ రాజశేఖర్, ఎస్ఐ మహేశ్వర్, ఎంపిఓ దయాకర్, ఏపిఓ నాగయ్య, సిసి చంద్రు, ఆర్ఐ శ్రావణి, ఏఈఓ శైలజ, గ్రామ పంచాయితీ కార్యదర్శి సునీత, ఉపసర్పంచ్ సురేష్ నాయక్ పాల్గొన్నారు.

## 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు

**ప్రజాపక్షం/నకిరేకల్ :**వానాకాలం2026 సీజన్‌కు సంబంధించి మండలంలోని రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువు కోసం జీలుగ, జనము విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ జానిమియా తెలిపారు.మండలానికి మొత్తం 106 క్వింటాళ్ల విత్తనాలు కేటాయించారని పేర్కొన్నారు.జీలుగ 30 కిలోల బ్యాగ్‌ను సబ్సిడీ అనంతరం రూ.2,452.50కు, జనము 40 కిలోల బ్యాగ్‌ను రూ.3,110కు రైతులు పొందవచ్చన్నారు. పచ్చిరొట్ట ఎరువులు భూసారాన్ని పెంపొందించడంతో పాటు పంటల దిగుబడులకు దోహదపడతాయని వివరించారు.విత్తనాలు అవసరమైన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్,ఆధార్ కార్డు జిరాక్స్,మొబైల్ నంబర్‌తో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను (ఏఈఓలు) సంప్రదించి పర్మిట్లు పొందాలని సూచించారు.ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వరద కాలువ మరమ్మతు పనులు ప్రారంభించిన సర్పంచ్



**ప్రజాపక్షం/రామన్నపేట :** గ్రామ పంచాయతీ పరిధిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వరద కాలువ పూడికతీత , మరమ్మత్తు పనులను గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ సోమవారం రోజు ఉదయం అధికారికంగా ప్రారంభించారు.రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, గ్రామంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా ఉండటానికి మరియు పంట పొలాలకు నీటి ఇబ్బంది లేకుండా ఈ వరద కాలువల పునరుద్ధరణ పనులను చేపట్టడం జరిగిందని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామం ఉప సర్పంచ్ బైకానీ ఉమా మహేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, సుధా, వార్డు సభ్యులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ గాదే హేమలత అధికారులు, కూనూరు రాజు గౌడ్ పాల్గొన్నారు.

# ధరల నియంత్రణకు 10న కలెక్టరేట్ ఎదుట సిపిఐ ధర్నా




## విజయవంతం చేయాలని సిపిఐ నాయకుల పిలుపు

**ప్రజాపక్షం/నాంపల్లి :** పెరుగుతున్న ధరల నియంత్రణకు 10న కలెక్టరేట్ ఎదుట సిపిఐఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ అంజయ్య చారి పిలుపునిచ్చారు. మండల కౌన్సిల్ సమావేశం పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన మండల కార్యవర్గ సభ్యుల కోరే సత్తయ్య అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశంలో మండల సహాయ కార్యదర్శి నేతాళ్ళ రాజు,తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు జనం పాట జగన్,మండల కార్యవర్గ సభ్యులు ఊరుపాక వెంకటయ్య, పల్లే సైదులు,నేరళ్ళ సైదులు,కౌన్సిల్ సభ్యులు,దామేర రమేష్,పల్లేటి దశరథ,బక్కయ్య,గొడ్డేటి సత్తయ్య, మహేష్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలు నిరసిస్తూ ఈ నెల 10వ తేదీన కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని కరపత్రం ఆవిష్కరణ చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి కోరారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పై పెనుబారం మోపుతూ అనేకమార్లు ధరలు పెంచి పేదల నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఆందోళన కార్యక్రమాలు పెద్ద ఎత్తున సిపిఐ నిర్వహిస్తుందని ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, పిల్లి శంకరయ్య, ఉడత రామలింగం, దాసరి అంజయ్య, యాదయ్య, కొండూరు విప్లవ్, బద్దుల సుధాకర్, టంగుటూరి రాములు, దాసరి మనోహర్,





ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/చండూరు:** ఈ నెల 10న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం చండూరు మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయం మాదగోని నర్సింహ్మా భవనంలో సిపిఐ మండల కార్యవర్గ సమావేశం సిహెచ్ ఊషయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ , మండల పార్టీ సహాయ కార్యదర్శులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు , పార్టీ జిల్లా సమితి సభ్యులు తిప్పర్తి రాములు , మండల పార్టీ కార్యవర్గ సభ్యులు దోటి వెంకన్న , బండమీది వెంకన్న పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/డిండి;** సోమవారం డిండి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశ అధ్యక్షులు జిల్లా రైతు సంఘం అధ్యక్షులు ఎండి. మైనోద్దీన్ వహింగా ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి మాట్లాడుతూ ఈనెల 10వ తేదిన నల్గొండ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముందు సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరుగుతుందని ఈ ధర్నాకి డిండి మండలంలోని కామ్రేడ్‌లు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి, మండల సహాయ కార్యదర్శులు శైలేష్, విజేందర్‌రెడ్డి, కేశవులు, వెంకటేశ్వర్లు, శ్రీను, హుస్సేన్, నవీన్ పాల్గొన్నారు.






## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య: వేముల

**ప్రజాపక్షం/నకిరేకల్ :** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు,డిజిటల్ తరగతులు,ప్రయోగశాలలు,గ్రంథాలయాలు వంటి సౌకర్యాలతో విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.

**నకిరేకల్‌లో ఇంటింటికి బడిబాట :** బడిబాట కార్యక్రమంలో భాగంగా నకిరేకల్ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సోమవారం ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలను వివరించారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి మేక నాగయ్య మాట్లాడుతూ ఉచితంగా యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్, మధ్యాహ్న భోజనం, గుడ్లు, రాగి జావ,షూ,టై,బెల్ట్‌లతో కూడిన కిట్లు ప్రభుత్వం అందజేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు రాములు,ఉపాధ్యాయ బృందం,ఎంపీపీఎస్ బాలికల పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## మర్రిగూడలో రేణుక ఎల్లమ్మ అమ్మవారికి బోనాలు సమర్పణ



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రేణుక ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం పట్టణ పరిధిలోని మర్రిగూడ శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారికి మహిళలు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈసందర్భంగా నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి దంపతులు, కార్పొరేటర్, ఆలయ చైర్మన్ గుమ్ముల జానకి మోహన్ రెడ్డి దంపతులతో పాటు 14వ వార్డ్ కార్పొరేటర్ బొజ్జ శంకరయ్య బ్రహ్మోత్సవాలలో పాల్గొని రేణుక ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మందడి శ్రీనివాస్ రెడ్డి,ఏదుల్ల మధుసూదన్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు దోనాల నాగార్జున రెడ్డి,గ్రామ శాఖ అధ్యక్షుడు గురిజ వెంకన్న గౌడ్, మాలె చంద్ర రెడ్డి,గుమ్ముల నాగిరెడ్డి,బొజ్జ చిట్టిబాబు,మర్రి సత్తయ్య, సుంకరబోయిన బాలయ్య పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ముగింపు కార్యాచరణ

**ప్రజాపక్షం/ఆలేరు :** తెలంగాణ రాష్ట్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ విజయవంతంగా ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో ముగిసింది. సోమవారం ఏడవ వార్డు, 8 వార్డు, 9 వార్డుల్లో సభలు నిర్వహించారు. ప్రజలకు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్, 2026 జెల్ సంచయ్, జల్ భగీరథ పథకం కింద ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టడం గురించి, మురికి కాలువల శుభ్రత అలాగే పూడిక తీయు పనులు, వర్షాకాల సంసిద్ధత పై, మంచినీటి సరఫరా, నీరు నిలువ ప్రాంతాల నివారణ ,పారిశుద్ధ్యం, రోడ్ల నిర్వహణ మరియు వీధి దీపాలు, మొక్కలు అలాగే పర్యావరణ సంరక్షణ కార్యక్రమాలపై అందిన ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలపై చర్చించడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ కే.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీజాన బాలమణి భాస్కర్, ఎనిమిదో వార్డు కౌన్సిలర్ బోట్ల సంపత్, 9వ వార్డు కౌన్సిలర్ పస్తం ఆంజనేయులు, మున్సిపల్ మేనేజర్ బి.జగన్మోహన్, మున్సిపాలిటీ సిబ్బంది ఎస్. సుకన్య, ఇ.వెంకటేష్, ఈ. సంధ్య, మరియు మెప్మా రిసోర్స్ సభ్యులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా గ్రామసభలు

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండలంలోని మోర్సకుంట తండ, మాచారం, నాగులపహాడ్, నారాయణగూడెం, ఎన్.అన్నారం, లింగాల గ్రామాల్లో సోమవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామ సభలను అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో మోర్సకుంట తండ గ్రామ సర్పంచ్ భూక్య లింగమ్మ హుస్సేన్, మాచారం గ్రామ సర్పంచ్ ఇటికాల శ్రీను, నాగులపహాడ్ గ్రామ సర్పంచ్ సంకరమద్ది నిరంజన్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రగతి ప్రణాళికల రూపకల్పన, స్థానిక సమస్యల పరిష్కారం, ప్రజాపాలన లక్ష్యాల ప్రాధాన్యతను వారు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారులుగా వ్యవహరించిన తహశీల్దార్ గుమ్మి రాజశేఖర్ రెడ్డి, ఎంపిడిఓ ఏ. జానయ్య, ఎంఇఓ నకిరేకంటి రవి, ఎంపిఓ బీస్ రాజేశ్వర్, పశువైద్యాధికారులు డాక్టర్ వెంకన్న, డాక్టర్ కిరణ్ కుమార్ పాల్గొని గ్రామసభల నిర్వహణను పర్యవేక్షించారు.

## నీటిని ఆదా చేద్దాం -భవిష్యత్తును కాపాడుదాం

**ప్రజాపక్షం/నార్కెట్‌పల్లి:** నీటిని ఆదా చేద్దాం భవిష్యత్తును కాపాడుదాం అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని సర్పంచ్ జేరిపోతుల భరత్ కుమార్ పిలుపునిచ్చారు.గ్రామపంచాయతీలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థనల్లగొండ ఆధ్వర్యంలో జల్ సంచయ్ జన్ భాగీదారి ప్రచార కార్యక్రమం,జల్ శక్తి అభియాన్ కార్యక్రమం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జేరిపోతుల భరత్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు.ఈకార్యక్రమంలో నల్లగొండ కళాజాత కోఆర్డినేటర్ వేముల పుష్పక్క బృందం కళాజాత ప్రదర్శన ద్వారా గ్రామ ప్రజలకు నీటి సంరక్షణపై



విస్తృత అవగాహన కల్పించింది.కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యనిర్వహణ అధికారిరవికుమార్,ఉపాధి హామీ పథకం ఎపిఓ శిరీష,ఎపిఎం జీడికల్లు,సిసి శ్రీను,టిఎఅశోక్,శ్రీను, ఫీల్డ్ అసిస్టెంట్ అండాలు,పాల్గొన్నారు.

## ఫ్లాట్లను ఆక్రమించిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** పెద్దచెరువు కబ్జా చేసి 102 ఫ్లాట్లను ఆక్రమించిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతూ భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి నాగరాజు తహసీల్దార్ వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు.నార్కట్‌పల్లి ప్రజల జీవనాడి అయిన పెద్దచెరువు (సర్వే నెంబర్ 550) ఇప్పుడు భూమాఫియా పంజాల్లో చిక్కుకుందని,చెరువు గర్భాన్ని మింగేసి 102 ఫ్లాట్లుగా విభజించి అమ్ముకుంటున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని వారు పేర్కొన్నారు. పచ్చని చెరువు స్థానంలో కంక్రీట్ జంగల్‌ను సృష్టించి భవిష్యత్తు తరాల నీటి వనరులను మాయం చేస్తున్న ఈఅక్రమ దందా వెనుక ఎవరి హస్తం ఉందో బయటపడాలన్నారు.ఈ అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం స్పందించాలని,లేనిపక్షంలో భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం నుండి నార్కట్‌పల్లి వరకు భారీ నిరసన ప్రదర్శనలు చేపడతామని హెచ్చరించారు.చెరువులను కాపాడటం అంటే నార్కట్‌పల్లి భవిష్యత్తును కాపాడటమేనని,ఈపోరాటంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ మండల కన్వీనర్ రావణ్ మహారాజ్,జనసేన మండల అధ్యక్షుడు మారీదు శివకుమార్,మైనార్టీ నాయకులు జానీ,గోసుల హరీశ్,మెడబోయిన అశోక్,దైద అరుణ్,రాకేష్ పాల్గొన్నారు.

## నూతన జిల్లా విద్యాశాఖాధికారికి శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లా విద్యాశాఖాధికారి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పి.సుశిందర్ రావును ఎస్‌టియుటిఎస్ జిల్లా శాఖ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను, విద్యా రంగానికి సంబంధించిన కీలక అంశాలను డిఈఓ దృష్టికి తీసుకెళ్లారు.సమస్యల పరిష్కారానికి సహకరించాలని విన్నవించారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా అధ్యక్షులు డా. తండు భాను ప్రకాష్ గౌడ్,జిల్లా ప్రధాన కార్యదర్శి మురారి శెట్టి రమేష్,పూర్వ జిల్లా అధ్యక్షులు కొనకంచి వీరరాఘవులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కందిమల్ల నరేందర్ రెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి కొనకంచి వెంకటేశ్వర్లు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్. రామ్ సింగ్, కె.దత్తేశ్వర్,అడిషనల్ జాయింట్ సెక్రటరీలు ఎ. తావూరియా, ఆర్.లాలు,జిల్లా ఉపాధ్యక్షురాళ్లు ఎస్‌కే. సమీన, కావ్య, నీరజ, జిల్లా కార్యదర్శి లాజర్, సోషల్ మీడియా ఇంచార్జ్ ఎన్. సురేష్ కుమార్, బి.సైదా నాయక్,స్టేట్ కౌన్సిలర్ వైద్యం శ్రీనివాస్ పాల్గొన్నారు.



# జులై చివరి నాటికి మిర్యాలగూడలో నక్ష సర్వే పూర్తి

## కలెక్టర్ బి. చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పైలట్ పద్ధతిలో ఎంపిక చేసిన మున్సిపల్ పట్టణ ప్రాంతాల్లోని స్థలాలు, భూములు, మౌలిక సదుపాయాలకు సంబంధించిన ఖచ్చితమైన సమాచార సేకరణ కోసం చేపట్టిన నక్ష సర్వేకార్యక్రమాన్ని మిర్యాలగూడ మున్సిపాలిటీలో జూలై చివరి నాటికి పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు.సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు,నక్ష సర్వే పైలట్ పథకం కింద ఎంపికైన మున్సిపాలిటీల్లో సర్వే పురోగతిపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మిర్యాలగూడలో జరుగుతున్న సర్వే వివరాలను వెల్లడించారు.జిల్లాలో మిర్యాలగూడ మున్సిపాలిటీ నక్ష సర్వే కోసం ఎంపికైందని, ఇందులో భాగంగా ఇండ్లు, ఖాళీ స్థలాలు, భవనాలకు సంబంధించిన సర్వే నిర్వహించేందుకు 32 వార్డులను గుర్తించినట్లు తెలిపారు. అలాగే 356 బ్లాకులు ఏర్పాటు చేయగా, వాటిలో 43 వ్యవసాయ బ్లాకులు,313 భవనాల బ్లాకులు ఉన్నాయని చెప్పారు.మొత్తం 25 వేల ఆస్తులను గుర్తించగా,ఇప్పటివరకు 9,375 ఆస్తులకు సంబంధించిన సర్వే పూర్తైందని, ఇది మొత్తం లక్ష్యంలో 37 శాతం అని వెల్లడించారు. ఇప్పటికే ఆరు వార్డుల్లో సర్వే పూర్తి కాగా,మరో ఆరు వార్డుల్లో సర్వే పురోగతిలో ఉందన్నారు.సర్వే నిర్వహణ కోసం ఐదు ప్రత్యేక బృందాలతో పాటు ఐదు లైసెన్స్ సర్వేయర్ల బృందాలను నియమించామని తెలిపారు. ఇండ్లు, బహిరంగ స్థలాలు, వ్యవసాయ భూములకు సంబంధించిన మ్యాపింగ్ పనుల కోసం మొత్తం 14 బృందాలు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రణాళికాబద్ధంగా పనులు కొనసాగుతున్నందున జూలై చివరి నాటికి నక్ష సర్వేను పూర్తి చేస్తామని కలెక్టర్ వివరించారు.అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ నక్ష సర్వే పనులను మరింత వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# మృగశిర కార్తె.. చేపల జోష్

## కిటకిటలాడిన మూసీ రోడ్డు

## ధరలు పెరిగినా తగ్గని గిరాకీ.. రోడ్లపైకి చేరిన వ్యాపారం





**ప్రజాపక్షం/నకిరేకల్ :** మృగశిర కార్తె వచ్చిందంటే చాలు.. చేపల కూర తినాల్సిందే అన్న సంప్రదాయం నకిరేకల్‌లో మరోసారి కనిపించింది. సోమవారం మృగశిర కార్తె సందర్భంగా పట్టణంలోని మూసీ రోడ్డులో నిర్వహిస్తున్న చేపల మార్కెట్ కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయింది. చేపలతో పాటు మటన్, చికెన్ దుకాణాల వద్ద కూడా భారీ రద్దీ నెలకొంది. అమ్మకందారులు, కొనుగోలుదారులు రోడ్లపైనే ఉండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.మృగశిర కార్తె నేపథ్యంలో చేపలకు ఒక్కసారిగా గిరాకీ పెరగడంతో వ్యాపారులు సాధారణ రోజుల కంటే అధిక ధరలకు విక్రయించారు. మార్కెట్‌లో రవ్వ, బొచ్చ చేపలు కిలో రూ.150 నుంచి రూ.200,కొర్రమేను రూ.500 నుంచి రూ.600, కంశలు రూ.400 నుంచి రూ.500, పాంప్లెట్లు రూ.100 నుంచి రూ.150, ఆలగా రూ.100 చొప్పున విక్రయించారు. ధరలు పెరిగినా ప్రజలు వెనుకాడకుండా కొనుగోళ్లు చేశారు.

**చాపలు ఎందుకు తినాలి..?** మృగశిర కార్తె రోజు చేపలు తినడం వెనుక ఆరోగ్యపరమైన కారణాలు ఉన్నాయని పెద్దలు చెబుతుంటారు. ఈ కాలంలో వాతావరణ మార్పులు ఎక్కువగా ఉండటంతో శరీరానికి అవసరమైన పోషకాలు అందేందుకు చేపలు తీసుకుంటారు. ముఖ్యంగా ఉబ్బసం, శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధపడేవారు చేపలను దివ్యౌషధంగా భావిస్తుంటారు. చేపల్లో ఉండే ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్‌డి, ప్రొటీన్లు, ఐరన్, జింక్, అయోడిన్ వంటి పోషకాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయన్న విశ్వాసం ప్రజల్లో ఉంది.

**సాంప్రదాయం... కొనసాగింపు**

శాకాహారులు ఇంగువ, బెల్లం కలిపి తయారు చేసిన ఉండలను తీసుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోంది. మృగశిర కార్తె సందర్భంగా ప్రతి ఇంట్లోనూ ప్రత్యేక వంటకాలు సిద్ధం చేయడంతో మార్కెట్లు సందడిగా మారాయి. అయితే ఈసారి కార్తె సోమవారం రావడంతో గత సంవత్సరాలతో పోలిస్తే గిరాకీ కొంత తగ్గిందని వ్యాపారులు తెలిపారు. అయినప్పటికీ మూసీ రోడ్డంతా కొనుగోలుదారుల సందడితో కళకళలాడింది.

# టిపి,ఉర్దూ ఉపాధ్యాయ సంఘం వినతి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలలకు శాశ్వత సొంత భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం (టీఎస్‌పిటీఏ), ఉర్దూ ఉపాధ్యాయ సంఘం నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావుకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ జిల్లాలో అనేక ప్రభుత్వ పాఠశాలలు ఎన్నో సంవత్సరాలుగా అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అద్దె భవనాల్లో నడుస్తున్న పలు ప్రభుత్వ కార్యాలయాలను ప్రభుత్వ భవనాలకు మార్చిన నేపథ్యంలో, ప్రభుత్వ పాఠశాలలకు కూడా సొంత భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఈకార్యక్రమంలో టీఎసపిటీఏ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ గఫూర్,జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి. షాహిన్ తయ్యబ్, అదనపు ప్రధాన కార్యదర్శి ఎ. రాములు, ఉపాధ్యక్షుడు అయూబ్ ఖాన్, ఉర్దూ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు జుబేర్, ప్రధాన కార్యదర్శి బియాబాని, అదనపు కార్యదర్శి ఖాన్ పాల్గొన్నారు.



# వాసాలమర్రిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను సోమవారం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వాసాలమర్రి గ్రామంలో కలియ తిరుగుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పర్యవేక్షించారు. మొత్తం ఇందిరమ్మ ఇండ్లు ఎన్ని మంజూరయ్యాయని, నిర్మాణంలో ఏ దశలు ఉన్నాయో అధికారులను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం ప్రారంభం కానీ లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా ఇండ్ల నిర్మాణ పనులు చేపట్టాలని లబ్ధిదారులకు సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లంకల గీతారెడ్డి, హౌసింగ్ డిఈ శ్రీరాములు, గ్రామ సర్పంచ్ దొమ్మాట అనురాధ, హౌసింగ్ ఏఈ నరేష్, కార్యదర్శి నవీన్ నారాయణ, ఈసీ యశోద, టీఏ చంద్రశేఖర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గీతారెడ్డి, హౌసింగ్ డిఈ, గ్రామ సర్పంచ్ దొమ్మట అనురాధ బాబు, ఏపీఓ నారాయణ, ఈసీ యశోద, టెక్నికల్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సమ్మెకు సిపిఐ సంఘీభావం



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** భవన నిర్మాణ కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కొనసాగుతున్న సమ్మెకు సిపిఐ జిల్లా కార్యదర్శి దామోదర్ రెడ్డి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికుల దీక్ష శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సంక్షేమ బోర్డు ద్వారా అందాల్సిన ప్రయోజనాలను పారదర్శకంగా అందించాలని ప్రభుత్వం డిమాండ్ చేశారు. కార్మికుల పోరాటాలకు సమాజా హక్కుల కోసం జరుగుతున్నవేనని సిపిఐ ఎల్లప్పుడు కార్మిక వర్గానికి అండగా నిలుస్తుంది స్పష్టం చేశారు. కార్మికుల ఐక్యతతోనే హక్కులు సాధ్యమవుతారని కోరుకుంటూ సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనబోని గాలయ్య, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు దుబ్బాక సంజీవ, ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి, సిఐటియు నాయకుడు కొంగరి మారయ్య, జనగాం ఎట్టయ్య, శంకరయ్య, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. రేషనలైజేషన్ ప్రక్రియను రద్దు చేయాలని డీఈఓకు టీఎస్‌పి

# ప్రమాదకర విత్యుత్ స్తంబాల దిశను మార్చాలి



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని ఇబ్రాహీంపూర్ గ్రామంలో ప్రజావాసాలను ఆనుకొని విద్యుత్ వైర్లు, స్తంభాలు రైతులకు తాకేలా కిందిగా ఉన్నాయని, ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందో అని భయబ్రాంతులకు గురవుతున్నాయని, వెంటనే తమ సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామస్థులు, బూరుగు మధుసూదన్ రెడ్డి సంబందిత విద్యుత్ శాఖ అధికారులను కోరారు. కరెంట్ ప్రమాదాల బారిన పడకుండా రైతులను కాపాడాలని కోరారు.